# వందనా కాలేజ్

- కొమరవోలు సరోజ

వందనా కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. ఆ రోజు కార్తీక పౌర్ణమి కావటం వల్ల వందనాదేవి ఇంట్లో సత్యనారాయణ వ్రతం ముగించుకుని, ప్రసాదం స్వీకరించి, కట్టుకున్న కంచిపట్టు చీర మార్చుకుని, అమెరికన్ డ్రెస్ వేసుకుని రయ్యిరయ్యిన కారు డ్రైవ్ చేసుకుంటూ రెడ్ లైట్లను కూడా ఖాతరు చెయ్యకుండా వచ్చి వాలింది.

అప్పటికే ఆమె మిత్రబృందమంతా అతిధులను సాదరంగా ఆహ్వానించి... పన్నీరు చల్లి, స్త్రీలకు చిన్న మల్లెపూల మాల, పురుషులకు గులాబీ పువ్వు ఇచ్చి....గెస్ట్ బుక్‌లో సంతకం చేయించి... లోపలికి తీసుకువెళ్ళి.... మేంగో మిల్క్‌షేక్ ఇచ్చి.. మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్ అని చెప్పి...ప్రోగ్రామ్ షీట్ ఇచ్చి వెళ్ళారు.

గవర్నరుగారొచ్చి ఎర్రని సిల్కు రిబ్బన్ని బంగారు రంగు కత్తెరతో కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ రకమైన కాలేజ్‌కి ప్రారంభోత్సవం చేయటం తనకు ప్రధమం అని, అది తనకు కల్గిన మహత్తర అవకాశ మనీ...విద్యార్థులందరూ బాగా ఎంజాయ్ చేయగలరనీ నాలుగంటే నాలుగు వజ్రతుల్యమైన పలుకులు పలికారు.

తరువాత ఆ ఏరియా ఎమ్.పి మాట్లాడారు అభినందిస్తూ. ఆ తరువాత సోషల్ వర్కర్ అఫ్‌షాన్ మాట్లాడింది. చివరగా అందరికీ ధన్యవాదాలు తెలుపు కుంటూ నమ్రతగా రెండు మాటలు చెప్పి వందన సమర్పణ చేసింది వందనాదేవి.

అతిధులందరూ బ్లూబెర్రీ మఫిన్స్, సమోసాలు తిని, టీ తాగి వెళ్ళారు.

వందన ఆనందంతో తలమున్కలైపోతోంది. తను అనుకున్న ఈ కార్యం చిన్నా చితకా కాదు. ఎంతో బాధ్యత గల వ్యవహారం తలపెట్టింది తను. తను కెనడాకు వచ్చి అప్పుడే పది సంవత్సరాలు దాటిపోయింది. తనకెప్పుడూ ఏదో సాధించాలనే తపన. కుకింగ్, నిట్టింగ్, ఎంబ్రాయిడరీ, సంగీతం, కూచిపూడి నృత్యం, సైకాలజీ యే కాక "ప్రీమేరీడ్" కోర్స్ కూడా ప్రవేశపెట్టింది, అది ఆరు నెలల చదువు. దీనివల్ల అవగాహన, సర్దుబాటు తత్వం అలవరటం మాత్రమే కాకుండా ఏ పరిస్థితుల్లో ఏ రకంగా హేండిల్ చెయ్యాలో కూడా తెలుస్తుంది.

జనవరి ఎనిమిదవతేది రెండువేల నాలుగు.

ముప్ఫయిమంది వున్న క్లాసది. ఒక్కొక్కళ్ళనీ వాళ్ళ గురించి చెప్పి పరిచయం చేసుకోమని చెప్పి.....ఈ కోర్స్ తీసుకోవడానికి గల కారణాలు వివరించమని చెప్పింది




టీచరు సౌ అని పిలవబడుతున్న సౌభాగ్యం. ఈ కోర్స్ చాలా వెరైటీగా వుందనీ, కొత్తగా కూడా అనిపించిందనీ అంతే కాక బాగా అవసరమని పించిందనీ అందుకే తీసుకున్నామంటూ ఎవరి కారణాలు వాళ్ళు చెప్పారు. క్లాసు జరుగుతోంది.

"మగ పిల్లలు తల్లికి చాలా ప్రత్యేకమైన గౌరవాన్నివ్వాలి. ఆ ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేని వాడు భార్యను ఏ మాత్రం గౌరవించలేడు. అలాగని చెప్పి తల్లి భార్యమీద నేరాలు చెప్పినా...భార్య తల్లి మీద గరమ్మసాలా వేసి వున్నవీ-లేనివీ కల్పించి నూరిపోసినా విని, బుర్రకెక్కించుకుని వాళ్ళను హర్ట్ చేయకూడదు.

భర్త భోజన ప్రియుడైతే భార్యకు వంటరాని పక్షంలో, నిందించి, తూలనాడి ఆమెకు అటు ఏడు తరాల వాళ్ళనూ ఇటు ఏడు తరాల వాళ్ళనూ శాపనార్ధాలు పెట్టనవసరం లేదు.

"మూడు తరాల వాళ్ళకు పెట్టొచ్చా?" బ్రేసెస్ బయట పడేటట్లు ఇకిలిస్తూ అడిగాడొక విద్యార్థి.

"స్టాపిట్.... మధ్యలో పిచ్చి ప్రశ్నలు వేస్తే, బయటికి పంపిస్తాను. మళ్ళీ వెనక్కురావటం లేదు. మీరు కట్టిన ఫీజు కూడా వాపసు రాదు. పాఠం పూర్తి అయ్యాకనే మీ ప్రశ్నలూ, డిస్కషనూ. మధ్యలో ఎవరైనా వెకిలి నవ్వులు నవ్వినా, చచ్చు ప్రశ్నలు వేసినా పది అమెరికన్ డాలర్లు ఫైన్... "కెనేడియన్ డాలర్లు....పనికి.....రావా...?" ఎవరో

నసిగారు. సౌ పాఠం చెప్పటం రెండు నిమిషాలు ఆపి... అక్కడే కిటికీలో పెట్టిన నీలం రంగు డబ్బా చూపించింది. కొట్టొచ్చినట్లు 'ఫైన్ యు.ఎస్ డాలర్లు ౧౦' అని పసుపు పచ్చని రంగులో అందరికీ కనబడింది.

భర్త వంటచేయవచ్చు. భార్య సహాయం చేయవచ్చు. కూరలు తరగడం, బియ్యం కడగటం, కూరపొడి తయారు చేయటం, వంటగది శుభ్రం చేయటం ఇత్యాదులు.

భార్య కూడా దొరికిందే ఛాన్సని "ఒక అన్నం మెతుకు కంటే రెండవది పొట్టిగా వుంది, సాంబారు పొడిలో మిరియాలు ఎక్కువైనాయి, వంకాయ కూరలో పసుపు ఎక్కువైంది, దొండకాయ పచ్చడిలో పోపు మాడింది, మామిడికాయ పప్పులో టెంక కనబడింది, మజ్జిగపులుసులో పకోడీ రుచిగా లేదు. మా నాన్న ఇంకా బాగా వండేవాడు. మా వంటమనిషి మీకంటే నయం" అంటూ వంకలు పెట్టకూడదు.

భర్తకానీ, భార్యకానీ నాన్ వెజ్ తినేవారైతే.....మెల్లగా ఆ వాసనలు భరించటం రెండోవారు అలవాటు చేసుకోవాలి. అంతేకానీ తమ అయిష్టాన్ని మాటల్లో, చేతల్లో, ముఖకవళికల్లో హావభావ ప్రదర్శనలు చేయ నక్కరలేదు. అతిథులొచ్చినప్పుడు ఇంటి పన్లలో భర్తకానీ, భార్యకానీ తప్పకుండా సహాయం చేయాలి. ఎవరో ఒక్కరు మాత్రమే చేయాలంటే అది అసాధ్యం కాకపోయినా కష్టసాధ్యం.

ఒక్క వ్యక్తి సామాన్యమైన సంపాదనతో గృహంలో ఎంత అవకతవకలూ, ఆర్థికమాంద్యం కనిపిస్తుందో, ఆ రకంగానే.... పనిపాటల్లో శ్రమవిభజన లేకపోతే.... అసహనం, చిరాకూ, ఒకర్నొకరు దెప్పిపొడుచుకోవటం...... మనం వుంటున్న దేశాల్లోని ప్లస్ పాయింట్లన్నీ మరిచిపోయి.... మారాత, నా గీత అంటూ తమను తాము తిట్టుకొంటూ..... ఇండియాలో అందరూ సుఖపడి పోతున్నారంటూ ఓ విసురు విసరటం... మెల్లిమెల్లగా చినికిచినికి గాలివాన అయినట్లు....సెపరేషన్స్....విడాకులు లాంటి వాటికి అవకాశం వుంది. కాబట్టి, ఎదటివారి పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయిత్నించాలి. ప్రయత్నలోపం ఏమాత్రం వుండకూడదు. అయినప్పటికి కొన్ని విషయాల్లో మనం నిమిత్తమాత్రులం అని గ్రహించాలి.

"నాకు వంటరాదు. నేర్చుకోవాలనే ఇంట్రస్టుకూడా లేదు. అయినా పెళ్ళి తరువాత భార్య వంట చేయాలనే కోరికవున్నవాడైతే.... నాకు వంకాయలు కూడా తరగటం రాదని గ్రహించి దొండకాయల్లాంటివి తరగటం నేర్పించాలంటే.... నా భర్త నా నడుంచుట్టూ చేతులు వేసి.....'మధువొలకబోసే నీ చిలిపికనులు' అని పాడుతూ రొమాంటిక్‌గా వంట నేర్పించాలని నాకోరిక. అందుకు వ్యతిరేకంగా జరిగితే నేను ఒప్పుకోనుగాక ఒప్పుకోను" తన గట్టిగొంతుతో హై పిచ్‌లో బల్లగుద్ది మరీ చెప్పింది వినయలక్ష్మి.

"ఈ కోర్స్ పూర్తయ్యేసరికి తప్పకుండా నీ అభిప్రాయం మారి తీరుతుంది." ఘంటాపథంగా చెప్పింది సౌ.

వందనగారి కాలేజ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా లక్షణంగా మూడు బాచ్‌లూ నాల్గు కోర్సుల్లా చక్కగా నడుస్తోంది. టీచరు సౌభాగ్యం మెటర్నటీ లీవులో వుంది. కుంకుమరేఖ టీచ్ చేస్తోంది.

"పెళ్ళి ఒక పద్మవ్యూహం లాంటిది. అభిమన్యుడి లాగా కాకుండా వ్యూహం ఛేదించటం కూడా నేర్చు కోవాలి.అభిమన్యుణ్ణి యుధిష్టులవారు కోరినట్లు ఎవరైనా మీమీ కుటుంబాలలోని వారు కోరినా ఈ సంసార వ్యూహంలోకి అడుగుపెట్టకూడదు. మర్యాదగా తిరస్క రించాలి. లేకపోతే ఎంతో కష్టపడాల్సొస్తుంది. ఈ పెళ్ళి అనే ఝుంజాటం వుంది చూశారూ, లోపలికి వెళ్ళటం సులభం, బయట పడటం అతికష్టం. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా బాగా దెబ్బతిని చితికిపోతారు. ఆడపిల్లలకు త్వరగా అవగాహన శక్తి వస్తుంది కనుక పెళ్ళి వయస్సు ఇరవైరెండు నుండి ఇరవై ఐదు మధ్య, మగపిల్లలకు ఇరవైఐదు ముప్ఫయి మధ్య అనుకూలం. వయస్సులో మగవాళ్ళే మూడునాలుగేళ్ళు పెద్ద అయితే బాగుంటుంది.

ఎటువంటి ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా ఈ 'పెళ్ళి' అనే బంధానికి అనుబంధపు శ్రీ కారం చుట్టాలి. తల్లిదండ్రుల దగ్గరనుండి వచ్చినట్లుగా ముఖ్యంగా ఆడపిల్లలకు 'అన్ కండిషనల్' లవ్ ఇక్కడ లభించదు. భార్యాభర్తలు మనస్సులోని విషయాలు ఓపెన్‌గా మాట్లాడుకోవాలి. వారానికి ఒక్కరోజు, అలా కుదరకపోతే హీనపక్షం, కనీసం నెలకొక్కరోజు రెండు మూడు గంటలు కుటుంబ విషయాలూ, నిర్ణయాలు, ద్రవ్యసంబంధమైనవీ చర్చించుకోవాలి. ఒకరినొకరు అవసరమైనంత వరకు మాత్రమే జడ్జి చేసుకోవాలి. కంపేరిజన్స్ ఏమాత్రం మంచిది కాదు. ఇంకో స్త్రీతో భార్యను కంపేర్ చేస్తూ

మాట్లాడితే ఆమె ఎంత హర్ట్‌వుతుందో తెలుసుకోవాలి. అలానే ఇంకో పురుషుడితో అస్తమానం కంపేర్ చేస్తుంటే భర్త ఏ రకంగా రియాక్ట్ అవుతాడు, ఎంత హర్ట్ అవుతాడు అనే విషయాన్ని ఆలోచించి మరీ మాట్లాడాలి.

ఇంకొకరి బూట్లలో మన కాళ్ళు పెట్టి పది మైళ్ళు నడుస్తే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తే పది మైళ్ళు కాదు ఒక్క మైలు కూడా నడవడం సరికదా పది అడుగులు వెయ్యటానికి కూడా ఎంత నొప్పి పుడుతుందో,ఆ బాధ ఎటువంటిదో ఒకసారి మీ చెప్పులు కాని వాటిల్లో నడచి చూస్తే అవగాహనవుతుంది.

భార్య అలసిపోయి ముఖం వేలాడేసుకుని ఆఫీసు నుంచి వస్తే.....తాను ఆమెకంటే ముందుగా వచ్చివుంటే... కాస్త అనునయంగా మాట్లాడి ఓ కప్పు టీ యివ్వటం, దగ్గర కూర్చోవటం అవసరం. అలానే భార్య కూడా.

తల్లి కాబోయే భార్యను చేతనైనంత అపురూపంగా చూడాలి. కొత్తగా పెళ్ళయిన జంటల మధ్య పెద్దవాళ్ళ అభిప్రాయాలు, వాళ్ళు చొరబడటం లేకపోతే చాలా మంచిది. ఒకవేళ వాళ్ళు చొరవ తీసుకొని పెత్తనం చేయటం ప్రారంభిస్తే ఆదిలోనే తుంచెయ్యాలి.

ఆ రోజు వందనగారి కళాశాల వార్షికోత్సవాలు. విద్యార్థులు కొందరు పాటలు పాడారు. మరికొందరు తాము స్వయంగా వ్రాసిన నాటకం "ఓర్వూ-నేర్పూ" ప్రదర్శించారు. ఈ కోర్స్ వల్ల తామందరూ ఎంత లబ్ది పొందారో ఎంత అవగాహన అలవరచుకున్నారో చెప్పకనే చెప్పింది ఆ నాటకం.

వందనాదేవికి అసలీ రకమైన కాలేజ్ పెట్టటం, అందునా ఈ ప్రత్యేకమైన కోర్స్ ప్రవేశపెట్టటం అనే ఆలోచన ఎలా కలిగిందో చెప్పమని కోరారు.

చిరునవ్వుతో వేదిక మీదకు వచ్చిన వందన చెప్పింది.

"ఇందులో అంత వింతేమీ లేదు. నాచుట్టూ వున్న ప్రపంచం, మనుష్యులు, మా కుటుంబం. అవగాహన లేకపోవటం ఒక్కటే కాక ఆటుపోట్లకు తట్టుకునే శక్తి లేకపోవటం వల్ల, ద్రవ్యలోపం వల్ల ఛిన్నాభిన్నమైన సంసారాలు. భార్యా భర్తల మధ్య ప్రేమాంకురం, అనురాగసుధ చిప్పిల్లాలంటే.... కొంత ప్రేమ అవసరమే అయినా..... పాతికేళ్ళు దాదాపు ఎక్కడో పుట్టిపెరిగిన వాళ్ళకు ఆలోచనా విధానం, అలవాట్లూ ఒకేమాదిరి వుండవు కదా! సర్దుబాటు మనస్తత్వానికి ఇలాంటి చదువులు కూడా అవసరమని నేను భావించాను. ఇండియాలో కూడా ఈ కోర్స్ కొంతవరకూ ఉపయోగించిందనే చెప్పవచ్చు. ఆ ఆలోచనతోనే నేను ఇక్కడ కూడా ప్రారంభించాను. నాకు ఇక్కడ అవకాశమిచ్చిన స్కూల్ బోర్డుకి, మా టీచర్స్‌కి, స్టూడెంట్స్‌కి అందరికీ నా కృతజ్ఞతలు. నా భర్త సహకారం లేకపోతే నేనేమీ చేయలేకపోయేదాన్ని" గొంతు జీరబోయింది. .... ఆవేశంతో ఆనందంతో నిలువెల్లా పులకించి.... దుఃఖం ముంచుకొచ్చింది. ఇంక నిగ్రహించుకోలేక..... 'నమస్తే' అంటూ చేతులు జోడించి చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ..... పరుగులాంటి నడకతో.... రెస్ట్‌రూమ్ లోకెళ్ళి.... ముఖం కడుక్కుని నెమ్మదిగా తిరిగివచ్చి తనపని చూసుకోసాగింది.

నిండుమనస్సుతో నిష్కల్మషమైన తలంపులతో అణువణువూ హాయినిగొల్పే సేవాభావంతో ఆ రోజు సంస్థకు వచ్చిన విరాళాలలో రెండు వంతులు స్త్రీ సంక్షేమనిధికి, ఒక వంతు చిన్నపిల్లల సంక్షేమనిధికి, మిగిలింది పురుషబాధితుల సంఘసంక్షేమానికి విరాళంగా ఇచ్చింది.

కొన్ని గంటల్లో ఆమె జీవితంలో "పెద్దమార్పు" రాబోతుందని కూమెకు చూచాయగా సూచన ప్రాయంగానైనా తెల్సివుంటే......ఆమె ఏ రకంగా ప్రవర్తించి వుండేదో అని కనక ఆలోచిస్తే.....ఆమెను ఎరిగున్నవారూ, అసూయాపరులు కాని వారెవ్వరైనా ఖచ్చితంగా చెప్పగలరు "ఆమె ఈమాదిరిగానే వుండేది. పోతే శ్రీ కృష్ణ దేవరాయలవారి ఆస్థానంలోని జ్యోతిష్కుడిలాంటి వారెవరైనా ఘంటాపథంగా నొక్కి వక్కాణించి భవిష్యత్‌ని సూచిస్తే కొంతవరకైనా జాగ్రత్తపడి షాక్ అయ్యుండేదికాదు" అని.

ఆమె ఆ స్కూల్లో ప్రవేశపెట్టిన "ప్రీమేరీడ్" కోర్స్ ప్రోగ్రాం అందరికీ బాగా నచ్చటమే కాక ఉపయోగం గానూ, లాభసాటిగానూ వుంది. కేవలం అసలు పెళ్ళికాని వారికి మాత్రమే కాక రెండవసారి మూడవసారి పెళ్ళి చేసుకోబోయేవాళ్ళక్కూడా బాగా వుంది గతంలోని పొరపాట్లను సరిదిద్దుకోవడానికి.

తను బిజీగా వుండటంవల్ల సరిగ్గా తినలేదు.... ఆయన ఏం వండారో ఈరోజు.... తనకిష్టమని బంగాళ దుంపలకూరలో బాగా జీడిపప్పూ అల్లం పచ్చిమిరప కాయలు దట్టించి వేసారేమో !

ఆకలి దంచేస్తోంది బాబూ! మజ్జిగపులుసు

చేశారేమో! ఎంత చక్కగా నేర్చుకున్నారు వంటలన్నీ! తను నిజంగా అదృష్టవంతురాలు. అమ్మా నాన్నా వుంటే ఈరోజు తనని తన సంసారాన్ని చూసి ఎంత మురిసిపోయేవారో! 'పైనించి చూస్తాంలే తల్లీ నీ అభివృద్ధిని' అనేది అమ్మ. అట్లాగే జరిగింది. మనస్సు బాధతో బరువెక్కబోతోందని గ్రహించి ఆలోచనలను మళ్ళీ ఫుడ్ మీదకు మళ్ళించింది వందన. కంది పచ్చడి తిని ఎన్నేళ్ళయిందో! రేపు ఇంట్లో వుంటుందిగా చక్కగా కంది పచ్చడి, వంకాయ పులుసు పచ్చడి, గుమ్మడికాయ వడియాలు చేసుకోవచ్చు తను. భోజనం గురించి ఆలోచిస్తూనే తలుపు తాళం తీసింది. త్వరగా భోజనం చేసి..... డేకేర్‌కి వెళ్ళి పిల్లలు ముగ్గుర్నీ తీసుకురావాలి అనుకుంటూ.

ఇంట్లోకి వచ్చిన వందన తిండిమాట మర్చిపోయి అవాక్కయింది. అప్రతిభురాలైంది. శిలాప్రతిమే అయింది కొంతసేపటివరకు. ఇంట్లో చిరిగిపోయిన సోఫా తప్ప ఇంకేమి లేవు. కొత్త సోఫాసెట్టు, డైనింగ్, క్రిష్టల్ షోపీస్‌లూ వెండివీ ఏమీలేవు. బెడ్‌రూమ్ లోకెళ్ళి డ్రెస్సర్ సొరుగులు లాగి చూసింది. ఇంట్లో వుంచిన నగలు ఒక్కటీ లేవు.

మర్నాడు బేంకుకి వెళ్ళి లాకర్ తెరిచి చూసింది.

షాక్ మీద షాక్ ఎలెక్ట్రిక్ షాక్ కొట్టినట్లు. ఎంత వద్దనుకున్నా కళ్ళల్లోనుంచి గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ఎక్కౌంటులో రెండంటే రెండు డాలర్లు మిగిల్చాడు మహానుభావుడు జానతన్. బాధగా విరక్తిగా ఆమె పెదవులమీద నవ్వు కాని నవ్వు. ఎంతకు తెగించాడీ జానతన్.. తన భర్త... అవును నిజంగా తన భర్తే, తన మురిపాల ముద్దుమగడు. అక్షరాలా అగ్నిసాక్షి.

జాయింట్ ఎక్కౌంట్ ఓపెన్ చేయటం తనదే తప్పు. తన స్కూలు ఎంతోమందికి ఆదర్శమైంది. కానీ తను మోసపోయింది అతగాడి తీయతీయని మాటలకి. అందుకే అతని భార్య అయింది. గత ఐదేళ్ళనుండీ చక్కగా వున్నాయనుకున్న పరిస్థితులు..... .స్కూలు మీద రాబడి బాగా వుండటంతో జానతన్ తన ఉద్యోగం మానేసి అక్కౌంట్స్ చూడటం మొదలుపెట్టాడు. అదే అతని అత్యాశకూ, పతనానికీ నాంది. తన కొత్త లెక్సస్ కూడా అతని పరమే అయింది. మనసంతా దుఃఖంతో నిండి ఆమె నిలవలేకపోతోంది. రక్తం మరుగుతోంది. ఏదో ప్రతీకారవాంఛతో సలసలా కాగుతోంది. ఫంక్షనుకు రాకుండా ఎంతపని చేశాడు జానతన్! తెల్లవాణ్ణి నమ్మి తప్పు చేసిందా తను! విధి నిర్ణయం ఇదే అయితే ఎవ్వరైనా ఒక్కటేనేమో! అన్యమనస్కంగానే తనకు తన భర్త దయతో మిగిల్చిన డొక్కు కారు కేమెరీని డ్రైవ్ చేసుకుంటూ డేకేర్‌కి వెళ్ళి పిల్లల్ని పికప్ చేసుకుంది.

'నేను ధైర్యంగా ఉండాల్సిన సమయమిదే' అనుకుంది గట్టిగా. కమ్యూనిటీ లివ్వింగ్ అంటారియోకు ఫోన్ చేసింది. వాళ్ళొచ్చి అవసరమైన సహాయా న్నందించారు. 'జానతన్! ఎంత దుర్మార్గానికి ఒడిగట్టావ్! ఎంత అమానుషం! తన బట్టలూ, పిల్లలవీ, చెప్పులూ, బూట్లూ ఒకటేమిటి! సమస్తం పరశురామ ప్రీతి. ఇక్కడ జానతన్ ప్రీతి... తను కమ్యూనిటీ లివింగ్‌కి చాలాచాలా ఋణపడివుంది, భవిష్యత్తులో తను ఆ సంస్థకు వంద వేలైనా ఇవ్వగలిగే స్తోమత రావాలి. తన స్కూలు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడవాలి' అనుకుంది ధ్రుడంగా పిల్లలు ముగ్గురూ ఆమె మీద చేతులేసి ఆదమరచి నిద్రపోతున్నారు. ఎదురుగ్గా వున్న ఫొటోలోని జానతన్ తనను చూసి వెక్కిరింతగా.... "యూ ఇండియన్ లేడీ.... చూడు... మోసపోయావ్.... గెలుపు నాదే సుమా!" అన్నట్లు చూస్తున్నాడు. వందన లేచి ఆ ఫొటో భళ్ళున పగిలేట్లు విసిరి పడేద్దామని అనుకుంది. కానీ ఆమె చదువూ, వివేకం, విచక్షణా అడ్డు తగిలి ఆగు... ఆగు... అంటూ హెచ్చరించాయి.

అప్పుడు నిశితంగా ఆలోచించి.... మనస్సును కొంత కుదుట పరచుకుని.... ఆ ఫొటోవంక చూసింది మళ్ళీ. సుమారు రెండువందల డాలర్ల ఖరీదు గల క్రిస్టల్ ఫొటో ఫ్రేమ్‌కి మారుగా డాలర్ స్టోరులో కొన్నట్లు కనబడుతున్న డాలర్ ఫొటో ఫ్రేమ్ తనను చూసి వికటాట్టహాసం చేస్తున్నట్లుంది. అది తీసి ట్రాష్‌లో పడేద్దామనుకుంది. లేవబోతున్న తల్లిమీద పిల్లలు ముగ్గురూ నిద్రలో అటూ ఇటూ పొర్లుతూ అమాయకంగా కాళ్ళూ చేతులూ వేసి 'అమ్మా మమ్మల్ని వదలకు' అన్నట్లు గట్టిగా బంధించి, 'నాన్న ఎప్పుడొస్తాడమ్మా?' అంటూ కలవరిస్తున్నారు. ఎక్కడి కెళ్ళాడో తెలియదు. ఇంత ఘనకార్యం వెలగబెట్టినవాడు ఇక జన్మలో రాడు. ఏ ముఖం పెట్టుకుని వస్తాడ్లే, వచ్చినా తను రానివ్వదు. ఇకనుంచీ ఈ పసివాళ్ళకు తండ్రి కూడా తనే.

నిశ్చయంగా అనుకుని తేలికపడిన హృదయంతో... మెల్లమెల్లగా నిద్రలోకి జారుకుంది వందన. ****